క్లుప్తంగా

నేడు బల్లికురవలో నూతన పెన్షన్‌ల పంపిణీ

బల్లికురవ: ప్రభుత్వం పింఛన్ సొమ్ము పెంపుతోపాటు అర్హులకు కొత్త పెన్షన్‌లు అందజేస్తుందని ఎంపీడీవో ఎల్ బుధవారం బ్రహ్మయ్య తెలిపారు. గురువారం ఉదయం స్థానిక పరిషత్ కార్యాలయం వద్ద మండలానికి మంజూరైన నూతన పెన్షన్‌తోపాటు పాత పెన్షన్‌లు 7941 మందికి అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి చేతుల మీదుగా అందజేస్తామని ఎంపీడీవో వివరించారు. పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

రేపు బుర్లవారిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2

చీరాల టౌన్: ప్రతి ఒక్కరిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరాన్ని శుక్రవారం మండలంలోని బుర్లవారిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కె.నేతాజీ బుధవారం తెలిపారు. ఈ శిబిరంలో అన్నీ రకాల వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందిస్తారన్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు, ఇతర వైద్య సేవలు ఉచితంగా చేస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

ఇంటి పన్నులు వసూలు చేయాలి

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో ఇంటిపన్నులు మార్చి 31 తేదీలోగా నూరుశాతం పన్ను వసూళ్లు చేయాలని ఎంపీడీవో కె.నేతాజీ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు 2023-24 , 2024-25 సంవత్సరాలకు నిర్ధారించిన ఇంటిపన్నుల డిమాండ్‌లను వంద శాతం వసూళ్లు చేయాలన్నారు. పంచాయితీలకు విధించిన నాన్‌టాక్స్‌లు వసూళ్లు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఉన్న మార్కెట్‌లలో పన్ను వసూళ్లకు మార్చిలోగా వేలం పాట నిర్వహించాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాయాల అడ్మిన్లు తదితరులు ఉన్నారు.

ఎస్‌పయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కారంచేడు: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘంలో స్కూల్ అసిస్టెంట్ యూనియన్ క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. 2024 సంవత్సర నూతన క్యాలెండర్‌ను మండలంలోని కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ ఎం ఏ ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు తమ సబ్జెక్టును విద్యార్థులకు బోధించడంలో ప్రధాన పాత్ర పోషించాలన్నారు. స్కూల్ అసిస్టెంట్‌లు విద్యార్థుల అభ్యున్నతికి ప్రత్యేక కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చెల్లి తిమోతీ, పీ బాబు, వీరమస్తాన్, శ్రీనివాసులు, కే కోటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కారంచేడు: పేద ప్రజలకు అందించాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసి ఉంచగా అధికారులకు వచ్చిన సమచారంతో వాటిని సీజ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల డీటీలు ఓంకార్, అనితలు దాడి చేసి పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం కారంచేడులో రేషన్‌షాపు నంబర్ 3కి సంబంధించిన బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేయకుండా ఒక గదిలో భద్రపరిచారు. దీంతో డీలర్‌తో పాటు, బియ్యం సరఫరా వాహన డ్రైవర్‌పైన 6-ఏ కేసు నమోదు చేసి వాహనాన్ని కూడా సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఐ కిషోర్, కారంచేడు వీఆర్‌ఓ విమోచనలు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శం



సావిత్రిబాయి పూలేచిత్రపటానికి పూలలు వేస్తున్న హనిమిరెడ్డి



కొడవలివారిపాలెంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు



మున్నంవారిపాలెంలో సావిత్రిబాయి పూలేకు ఉపాధ్యాయుల నివాళి

అద్దంకి/జే.పంగులూరు/మేదరమెట్ల/బల్లికురవ/అద్దంకి రూరల్: సంఘసంస్కర్త, రచయిత్రి, ఉపాధ్యాయిని, స్త్రీల చదువుకు పాటుపడిన సావిత్రిబాయి పూలే చిరస్మరణయులని పలువురు వక్తలు పేర్కొన్నారు. అద్దంకిలోని స్థానిక అంబేడ్కర్ భవన్‌లో బుధవారం బీఎస్పీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ ఐక్యవేదిక అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు పాల్గొని సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా విద్యకు ఆద్యురాలని, ఆమెను ఆదర్శంగా తీసుకుని పట్టుదలతో మహిళలు ముందుకుసాగాలని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఎస్పీ నాయకుడు మందా జోసప్, జైభీమ్‌రావు, పులిపాటి హేవేలు, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు. తిమ్మాయపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎం ఎస్‌జే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అద్దంకిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

➤ అణగారిన వర్గాల్లో ఆశాకిరణమై వెలుగునిచ్చిన ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే అని కొరిశపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కృష్ణకుమారి అన్నారు. మండల కేంద్రం కొరిశపాడు, మేదరమెట్ల గ్రామాల్లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొరిశపాడు అంబేడ్కర్ నగర్‌లోని ఎంపీపీ స్కూల్, మేదరమెట్ల వైసీ ప్రాథమిక పాఠశాలలో సావిత్రి బాయిపూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో రీసోర్స్‌సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కోఆర్డినేటర్ వీరయ్య, పీ.శ్రీవాణి పాల్గొన్నారు.

➤ సంతమాగులూరు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా 4.5 తరగతులు విద్యార్థులకు టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ప్రతి తరగతి నుంచి మొదటి ఐదు బహుమతులను ప్రకటించి వారికి అందించారు. కార్యక్రమం ఎంఈవో కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బహుమతి పొందిన విద్యార్థులతోపాటు ఉపాధ్యాయినులకు సన్మానం చేశారు.

మహిళా ఉపాధ్యాయినులకు సత్కారం..

కారంచేడు/చినగంజాం/మార్టూరు: దేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జీవితం మహిళలకు ఆదర్శమని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రమైన కారంచేడు ఎమ్మార్సీలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మహిళా ఉపాధ్యాయురాలుగా తీసుకున్న అనేక సాహసోపేత నిర్ణయాలతో నేడు సమాజంలో ఆమెను గుర్తు చేసుకోగలుగుతున్నామన్నారు. కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాల ఆవరణలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి హెచ్‌ఎం ఏ ఉమామహేశ్వరరావు అధ్యక్షతన నివాళులర్పించారు. ఉత్తమ సేవలందించిన తెలుగు ఉపాధ్యాయురాలు జీ రాజేశ్వరి, గణితం ఉపాధ్యాయురాలు భానుప్రియలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీ బాబు, కే బాబ్జీ, ఎస్ వీరమస్తాన్, వై శ్రీకాంత్, బీ శ్రీనివాసులు, కే రాజు, సీహెచ్ తిమోతీ, కే కోటయ్య, పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

➤ చినగంజాం మండలం మున్నంవారిపాలెం ఎంపీపీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఉపాధ్యాయిని హిమవంతేశ్వరిని హెచ్‌ఎం మల్లారెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎస్ చంద్రశేఖర్, ఎస్ నాగమల్లేశ్వరరావు ఘనంగా సత్కరించారు.

➤ బడుగు, బలహీన దళిత మైనార్టీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా విద్యను బోధించిన సావిత్రిబాయి పూలే కృషి ఎనలేనిదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ పేర్కొన్నారు. పర్చూరులోని బొమ్మల సెంటర్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసా చారి, జొన్నాదుల వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

➤ మార్టూరులోని ఎఫర్ట్ కార్యాలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు షేక్ రఫి, తమ్ములూరి శ్రీనివాసులు, లక్ష్మయ్యలకు బియ్యం, సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు టీ సాంబశివరావు మాట్లాడుతూ ఆమె జీవిత కాలంలో స్ఫూర్తిదాయకంగా సేవలు అందించి అందరి హృదయాలలో నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మద్దుమాల కోటేశ్వరరావు, కోశాధికారి చెరుకూరి నాగేశ్వరరావు, ఇంటూరి ఆంజనేయులు, ఎఫర్ట్ డైరక్టర్ జాష్టి వెంకట మోహనరావు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శం

చీరాల టౌన్: అణగారిన వర్గాల అభ్యున్నతికి, బాలికలకు విద్యనందించేందుకు కృషి చేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన సావిత్రిబాయి పూలే జీవితం అందరికి ఆదర్శప్రాయమని బహుజన సమాజ్ పార్టీ చీరాల ఇన్‌చార్జి కాటి మార్క్ అన్నారు. సావిత్రిబాయి జయంతిని పురస్కరించుకుని బుధవారం ఐక్యనగర్‌లోని బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు బీఎస్పీ నాయకులు డి.భాస్కర్‌రావు, సంగీతరావు, షరీఫ్, పుల్లయ్య, సునీత, మరియమ్మ పాల్గొన్నారు.



సంతమాగులూరులో ఉపాధ్యాయినులకు సన్మానం



కొరిశపాడులో మాట్లాడుతున్న సీడీపీవో కృష్ణకుమారి



అద్దంకిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకుల నివాళి



పర్చూరులో సావిత్రిబాయికి నివాళులర్పిస్తున్న నాయకులు



మేదరమెట్లలో సావిత్రిబాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు



మార్టూరు సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న రోటరీ సభ్యులు



చీరాలలో బీఎస్పీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇచ్చిన మాట తప్పని నాయకుడు సీఎం జగన్

- మాటతప్పని మడమతిప్పని నాయకుడు జగన్
- పోటెత్తిన పింఛన్‌దారులు
- పంపిణీ చేసిన హనిమిరెడ్డి



సంతమాగులూరులో డయాలసిస్ పింఛన్ అందిస్తున్న హనిమిరెడ్డి



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న హనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి): ఇచ్చిన మాట తప్పని నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శివరామప్రసాద్ అధ్యక్షతన నూతన పింఛన్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హనిమిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా మంజూరైన 73 పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నాయకుడి హోదాల్లో పాదయాత్ర సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చెప్పిన విధంగా పింఛన్‌ను అంచెలంచెలుగా రూ.3వే లకు పెంచారని గుర్తు చేశారు. సంక్షేమ పథక సారధిగా ప్రజారంజకపాలన అందిస్తున్న సీఎం పదికాలాల పాటు సీఎంగా ఉండాలని అందరూ దీవించాలని చెప్పారు. ఈసభను ఇప్పల ముసలారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు ఎన్నడూ లేని విధంగా పింఛన్‌దారులు స్వచ్ఛందంగా తరలి వచ్చారు. మహిళలు ఇన్‌చార్జికి ఎదురేగి గుమ్మడియాలతో దిష్టి తీసి స్వాగతం పలికారు. మండల కార్యాలయంలో మహాత్మా గాంధీ, దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చింతా రామారావు, జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ బొల్లినేని రామకృష్ణ, కారసాని వెంకట కోటిరెడ్డి, మండల నాయకులు ఓరుగంటి కోటిరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, ప్రజా ప్రతినిదులు, వలంటీర్లు, అధికారులు, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయం..

చినగంజాం: ప్రజా సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయం అని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానంద రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపాలెం పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఈ ఏడాది కొత్తగా మంజూరైన పెన్షన్ దారులకు పెన్షన్‌లు, రూ 3 వేలు పెరిగిన పెన్షన్ దారులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. మొత్తం కొత్తపాలెం పంచాయతీలో ఇప్పటి వరకు పెన్షన్ అందుకుంటున్న లబ్ధిదారులు 603 మంది కాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 250 పెన్షన్‌లు మంజూరు కాగా ఈ నెలలో కొత్తగా మంజూరైన 9 పెన్షన్‌లు అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో బాగంగా 60 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. నల్లమోపు భూలక్ష్మి వైఎస్ఆర్ బీమా మంజూరు కాగా రూ లక్ష నగదు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. దీంతో పాటు ఆమెకు కొత్తగా మంజూరైన రూ 3 వేలు పెన్షన్‌ను అందజశారు. కార్యక్రమంలో కార్యదర్శి బాబురావు, సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ కాపు, పెద్దలు పాల్గొన్నారు.



సంతమాగులూరులో హాజరైన పింఛన్‌దారులు



చీరాలలో కార్యక్రమానికి హాజరైన అధిక సంఖ్యలో ప్రజలు



చినగంజాంలో లబ్ధిదారులకు పెన్షన్ నగదు అందజేస్తున్న సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి

నైపుణ్యాలను వెలికి తీసేందుకే పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ

చీరాల అర్బన్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు మనోవికాసం సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ఎంఈవో పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మనోవికాసం సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేతిరాత, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులకు చదువుతో పాటు వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలన్నారు. కార్యక్రమంలో మనోవికాసం సంస్థ కన్వీనర్ నాయుడు ప్రతాపరెడ్డి, హెచ్‌ఎంలు బి.సాల్మన్‌రాజు, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, కె.రాజేంద్రప్రసాద్, సుశీల, రమణారావు, క్రీస్తురాజ్యం సల్మా తదితరులు పాల్గొన్నారు.

మన చేతుల్లోనే మన ఆరోగ్యం



నూతన అధ్యక్షుడు రామకృష్ణతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రతినిధులు

చీరాల రూరల్: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని.. ప్రతిరోజు క్రమం తప్పకుండా వాకింగ్ చేయడం వలన ఎంతో ఆరోగ్యంగా ఉంటారని 203 డిస్ట్రిక్ట్ ఇంటర్నేషనల్ వాకర్స్ మాజీ అధ్యక్షుడు చెలికాని సీతారామయ్య అన్నారు. చీరాల ఎస్‌ఆర్‌అండ్‌ పీఎం వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని బుధవారం వలివేటి మురళీకృష్ణ అధ్యక్షతన స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీతారామయ్య, డిస్ట్రిక్ట్ గవర్నర్ పి. శ్రీనివాసులురెడ్డి పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఎంతో నిబద్ధతతో పనిచేసి మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వాకర్స్ ఇంటర్నేషనల్‌లో ఆరు కోట్ల రూపాయల మూల నిధి ఉందని వాటి నుంచి వచ్చే వడ్డీలతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏదైనా కారణంచేత ప్రతిరోజు గ్రౌండ్‌లో వాకింగ్‌కు వచ్చే వాకర్ గ్రౌండ్‌కు రాకుంటే కారణాలు తెలుసుకుని మరలా వారిని వాకింగ్‌కు వచ్చే విధంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాకింగ్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని, వాకింగ్ చేయడం వలన వచ్చే ప్రయోజనాలు గురించి వివరించాలని సూచించారు. నిరుపేద విద్యార్థి గుండాల నిఖిలేష్‌కు దాత దోగుపర్తి వెంకట సురేష్ రూ. 5,000 విలువ కలిగిన సైకిల్‌ను ముఖ్య అతిథుల చేతులు మీదుగా అందజేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన పోలుదాసు రామకృష్ణ, సెక్రటరీ చారుగుళ్ల గురుప్రసాద్, ట్రెజరర్ గొడవర్తి సుధాకర్, 25 మంది కమిటీ సభ్యులతో ప్రమాణం స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్ సెక్రటరి వెంకటేశ్వర్లు, కోశాధికారి రామమోహన రెడ్డి, స్థానిక వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో గ్రామాల వారీగా పనులు

బల్లికురవ: ప్రభుత్వం వలసలను నిరోధించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో తక్షణమే గ్రామాల వారీగా కూలీల చేత పనులు చేయించాలని ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో 21 గ్రామ పంచాయతీల్లోని ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో ఉపాధి పనులతో సమీక్షించారు. 2024-25 సంవత్సరానికి రైత్వారీ కుంటలు, పంట కాలువలు, చెరువు కాలువల అభివద్ధికి రూ. 18 కోట్లతో అంచనాలు తయారు చేయించామని, పనులన్నింటిని నాణ్యత ప్రమాణాలతో చేపట్టి పూర్తిచేయాలన్నారు. పనులు చేసేటప్పుడు ఎప్పటి కప్పుడు రికార్డులు అప్‌డేట్‌గా ఉంచాలని టెక్నికల్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. సమీక్షలో ఏపీవో బాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.



ఉపాధి పనులపై సమీక్షిస్తున్న ఎంపీడీవో